క్లుప్తంగా

లేగ దూడలకు టీకాలు



శిరగాలపల్లిలో లేగ దూడకు టీకా వేస్తున్న సిబ్బంది

యలమంచిలి: లేగ పెయ్య (ఆడ) దూడలకు బ్రూసెల్ల వ్యాధి రాకుండా వ్యాక్సిన్ వేయించాలని మండల పశు వైద్యాధికారి పోరెడ్డి చంద్రశేఖరరెడ్డి కోరారు. ప్రస్తుతం వేస్తున్న గాలి కుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమంలోనే బ్రూసెల్ల వ్యాక్సిన్ కూడా ఉచితంగా వేస్తున్నట్టు ఆయన చెప్పారు. యలమంచిలి మండలం శిరగాలపల్లి, కట్టపాలెం గ్రామాల్లో సోమవారం పశు వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. 42 ఆవులు, 215 గేదెలకు గాలి కుంటు వ్యాధి (గాళ్ల వ్యాధి) రాకుండా టీకాలు, 18 లేగ దూడలకు బ్రూసెల్ల వ్యాక్సిన్లు వేసినట్టు డాక్టర్ చంద్రశేఖరరెడ్డి తెలిపారు.

పన్నుల వసూళ్లపై దృష్టి



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ అంజయ్య

నరసాపురం: మున్సిపాలిటీలో ఆస్తి, కుళాయి, ఖాళీ స్థలాల పన్నుల వసూళ్లు వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎం అంజయ్య అధికారులను ఆదేశించారు. సోమవారం కమినర్ తన చాంబర్‌లో పన్నుల వసూళ్లపై మున్సిపల్ రెవెన్యూ అధికారులు, వార్డు సచివాలయాల కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పన్నుల వసూళ్లకు ఈనెలాఖరు వరకే సమయం ఉందన్నారు. ఆదివారం కూడా మున్సిపల్ కార్యాలయంలో పన్నులు కట్టించుకోవాలని కమిషనర్ ఆదేశించారు. నూరుశాతం పన్నుల వసూళ్లపై దృష్టిపెట్టాలన్నారు. సమావేశంలో మున్సిపల్ ఆర్‌ఐ నానాజీ తదితరులు పాల్గొన్నారు.

మహిళల హక్కులపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న శోభనలక్ష్మి

పాలకొల్లు సెంట్రల్: మహిళల హక్కులపై అవగాహన కలిగి ఉండాలని స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (సీబీఐ విజయవాడ) పోలిశెట్టి శోభన లక్ష్మి అన్నారు. సోమవారం స్థానిక అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇంటర్నల్ కంప్లెయింట్స్ కమిటీ మహిళా సాధికారత, ఆర్థిక శాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో మహిళల హక్కులు, లైంగిక వేధింపులపై అవగాహన కార్యక్రమం ఏర్పాటుచేశారు. శోభన లక్ష్మి మాట్లాడుతూ పనిచేసే చోట లైంగిక వేధింపులను ధైర్యంగా ఎదుర్కోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ టి.రాజరాజేశ్వరి, సీహెచ్ ఉషారాణి, వి.యామిని, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జ్ఞాన సరస్వతి హోమం



సరస్వతి హోమం నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం(ప్రకాశంచౌక్): పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాలని జ్ఞాన సరస్వతి హోమం నిర్వహించారు. సోమవారం భీమవరం మెంటేవారి తోటలోని విజయ గణపతి ఆలయంలో ఆలయ అభివృద్ధి ఆధ్వర్యంలో గొల్లవెల్లి శ్యామ్ వెంకట త్రియాష్, భక్తులు స్కూల్ విద్యార్థులతో జ్ఞాన సరస్వతి హోమం, మేధా శక్తి హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు పెన్నులు అందించారు.

రాష్ట్ర మహా సభలు విజయవంతం చేయాలి

భీమవరం: రజక వృత్తిదారులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కార మార్గాలు-ప్రభుత్వ విధానాలు వంటి అంశాలపై చర్చించడానికి నిర్వహించే ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర 7వ మహాసభలను విజయవంతం చేయాలని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మన్నూరు భాస్కరయ్య కోరారు. సోమవారం భీమవరంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సి.గురుశేఖర్ అధ్యక్షతన జరిగిన రాష్ట్ర రజక వృత్తిదారుల సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. రజక వృత్తిదారులపై దాడులు, దౌర్జన్యాలు, అక్రమ కేసులు, గ్రామ సాంఘిక బహిష్కరణలు నేటికీ కొనసాగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన రజక అభివృద్ధి సంక్షేమ కార్పొరేషన్‌కు విధివిధానాలు రూపొందించకపోవడం, బడ్జెట్‌లో కేటాయించిన నిధులు రజకుల అభివృద్ధి, సంక్షేమానికి ఖర్చు చేయకపోవడంతో రజకుల జీవనం నేటికీ దుర్భరంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్టీఆర్ జిల్లా కొండపల్లి పట్టణంలో ఏప్రిల్ 20, 21 తేదీ తేదీల్లో మహాసభలు నిర్వహించనున్నట్లు భాస్కరయ్య చెప్పారు. అనంతరం మహాసభల ఆహ్వాన సంఘ బ్రోచర్‌ను ఆవిష్కరించారు.

ఉత్సాహంగా 'పది' పరీక్షలు ప్రారంభం



పాలకొల్లు సెంట్రల్ : పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులతో వారి తల్లిదండ్రులు

పాలకొల్లు సెంట్రల్: పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటలకు వరకు తెలుగు పరీక్ష నిర్వహించారు. ఉదయం 8.45 గంటల నుంచి విద్యార్థులకు పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించారు. పాలకొల్లు నియోజకవర్గంలో రెగ్యులర్ విద్యార్థులు 3066కి 3029 మంది పరీక్ష రాశారు. 37 మంది గైర్హాజరయ్యారు. సప్లిమెంటరీ విద్యార్థులు నియోజకవర్గంలో 106 మందిలో 66 మంది పరీక్ష రాశారు. ఉదయం పోలీస్ స్టేషన్ నుంచి సెక్యూరిటీతో పరీక్షా కేంద్రాలకు ప్రశ్నపత్రాలను తీసుకొచ్చారు. పరీక్ష ముగిసిన తరువాత జవాబు పత్రాలను పోస్టాఫీసుకు తరలించారు. పాలకొల్లు పట్టణంలో రెగ్యులర్ విద్యార్థులు 1591 మందికి 1585, సప్లిమెంటరీ విద్యార్థులు 54 మందికి 38 మంది, పాలకొల్లు మండలంలో రెగ్యులర్ విద్యార్థులు 374 మందికి 365 మంది, సప్లిమెంటరీ విద్యార్థులు 17 మంది పరీక్ష రాశారు. యలమంచిలి మండలంలో రెగ్యులర్ విద్యార్థులు 616 మందికి 605 మంది, సప్లిమెంటరీ విద్యార్థులు 23 మందికి 18 మంది, పోడూరు మండలంలో 485 మందికి 473 మంది, సప్లిమెంటరీ విద్యార్థులు 12 మందికి 10 మంది పరీక్షరాశారు.

మధ్యాహ్నం 2 నుంచి తరగతులు నిర్వహించాలి

పదో తరగతి పరీక్షల కేంద్రాల పాఠశాలల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు మిగిలిన విద్యార్థులకు తరగతులు నిర్వహించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. పది పరీక్షలు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 వరకు నిర్వహిస్తున్నారు. వికలాంగ విద్యార్థులకు మరో 30 నిమిషాలు అదనంగా సమయం ఇస్తున్నారు. దీంతో పరీక్షలు మధ్యాహ్నం 1.15 గటలకు ముగుస్తాయి. ఐతే మిగిలిన తరగతులకు మధ్యాహ్నం 1.15 గంటలకు పాఠశాలలు ప్రారంభించడంతో విద్యార్థులు 12.30 గంటల లోపే వచ్చేసి పాఠశాలల భయట ఎండలో కూర్చోవాల్సి వస్తోంది. పది పరీక్షలు రోజు విడిచి రోజు నిర్వహించడం వల్ల పరీక్షలు లేని రోజుల్లో రెగ్యులర్ స్కూల్ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు రెగ్యులర్ పాఠశాలల నిర్వహణపై పునరాలోచించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

తెలుగుకి 40 మంది గైర్హాజరు

నరసాపురం: పదో తరగతి పరీక్షలు సోమవారం ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 9.30 గంటలకు పరీక్ష ప్రారంభం కాగా, ఉదయం 8 గంటలు దాటిన తరువాత నుంచే పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థుల హడావుడి కనిపించింది. నరసాపురం పట్టణంలో ఏర్పాటుచేసిన ఎనిమిది పరీక్షా కేంద్రాల్లో 1,708 మంది విద్యార్థులకు 40 మంది గైర్హాజరయ్యారని ఎంఈఓ డి.పుష్పరాజ్యం చెప్పారు.

11 మంది గైర్హాజరు

యలమంచిలి: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. మండలంలో 11 హైస్కూళ్లు, రెండు ప్రైవేట్ స్కూళ్లు ఉండగా దొడ్డిపట్ల, మట్లపాలెం, యలమంచిలి, ఏనుగువానిలంక, కాజ హైస్కూల్స్‌లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటుచేశారు. మొత్తం 616 మంది విద్యార్థులకు 605 మంది హాజరవగా, 11 మంది గైర్హాజరయ్యారు. 23 మంది ప్రైవేట్ విద్యార్థులకు 18 మంది పరీక్ష రాశారని ఎంఈఓ కనుమూరు వెంకట రామకృష్ణంరాజు తెలిపారు.

ప్రశాంతంగా పరీక్షలు

పెనుగొండ: పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా పారంభమయ్యాయి. పెనుగొండ మండలంలో ఆరు పరీక్షా కేంద్రాల్లో 1,027 మంది విద్యార్థులకు 1015 మంది పరీక్ష రాశారు. 15 మంది గైర్హాజరయ్యారు.

పది పరీక్షలు ప్రారంభం

పెనుమంత్ర: పదో తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. మండలంలోని నాలుగు పరీక్షా కేంద్రాల్లో తొలి రోజు తెలుగు పరీక్షకు 507 మందికి, ఏడుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారని ఎంఈఓ ఉంగరాల నాగేశ్వరరావు తెలిపారు.



నరసాపురం: టేలర్ హైస్కూల్ వద్ద విద్యార్థులకు తనిఖీ



పెనుమంత్ర : మార్టేరు పరీక్షా కేంద్రంలో విద్యార్థులకు తనిఖీ



పెనుగొండ : విద్యార్థుల హాల్ టికెట్లు పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు

నిధుల దుర్వినియోగంపై ఫిర్యాదు

పాలకోడేరు: పాలకోడేరు మండలం మోగల్లు పంచాయతీలో ప్రజాధనం దుర్వినియోగమైందని వెంటనే విచారణ జరిపించాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్‌లో కొంతమంది ఫిర్యాదు చేశారు. మోగల్లు పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న కె.సుజాత 2021–22 సంవత్సరానికి పంచాయతీ నిధుల నుంచి వర్క్ నిమిత్తం రూ.27,45,609, ఖర్చుల నిమిత్తం రూ.14,03,953 కలిపి మొత్తం రూ.41,49,562 తన సొంత ఖాతాకు జమ చేసుకుని స్వాహా చేశారని సోమవారం గ్రామానికి చెందిన జాలే సునీత, కోనాల ప్రకాష్, ఐదో వార్డ్ మెంబర్ పి.వెంకటరాజు, పి.వెంకటరావు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో ట్యాంక్ వాచర్‌గా పనిచేస్తున్న గంగరాజుకు ఇవ్వాల్సిన బిల్లు అతనికి సొంత అకౌంట్‌కి కాకుండా సుజాత తన అకౌంట్ కు వేసుకుందని, పలు వర్కులకు అంచనా విలువ ముందుగా బోర్డు సభ్యులకు తెలియజేయకుండా కార్యదర్శి ఖాతాలో జమ చేసుకున్నట్లు ఆరోపించారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి



ఆర్డీఓ రాజుకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు



పెనుగొండలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న పింఛనర్లు

నరసాపురం: పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నరసాపురం శాఖ అధక్ష్య, కార్యదర్శులు ఏవీ నర్సయ్య, మీసాల సత్యనారాయణ కోరారు. ఈ మేరకు సోమవారం నరసాపురం ఆర్డీఓ దాసి రాజును కలసి వినతిపత్రం అందజేశారు. 2023 నుంచి పీఆర్‌సీ బకాయిలు మంజూరు చేయాలని, పీఆర్‌సీ కమిషన్ ఏర్పాటు చేసి ఐఆర్ ప్రకటించాలని, ఈహెచ్ఎస్ కార్డులపై వైద్యం చేయించాలని కోరారు.

పెనుగొండ: పెన్షనర్ల సమస్యలు సత్వరం పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పదవీ విరమణ ఉద్యోగుల సమాఖ్య కోరింది. ఈ మేరకు సోమవారం పెనుగొండ తహసీల్దారుకు వినతి పత్రం అందజేశారు. 12వ పీఆర్‌సీ కమిషన్ ఏర్పాటు చేయాలని, ఐఆర్ ప్రకటించాలని, డీఆర్, పీఆర్‌సీ బకాయిలు వెంటనే చెల్లించాలని, ఈహెచ్ఎస్ కార్డుపై వైద్యం చేయించే విధంగా ఏర్పాట్లు చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు టి.సత్యనారాయణ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రత్నాజీరావు, కోశాధికారి డీవీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో జాగ్రత్తలు తప్పనిసరి

పాలకొల్లు సెంట్రల్: వేసవిలో ప్రజలు వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించాలని డాక్టర్ ఎం నవ్య జీవన్ అన్నారు. సోమవారం మండలంలోని వెలివల గ్రామంలో గ్రామ సచివాలయం వద్ద ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, గ్రామస్థులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటుచేశారు. డాక్టర్ నవ్య జీవన్ మాట్లాడుతూ ఎండల్లో అతిగా తిరగకూడదని అన్నారు. ముఖ్యమైన పనులు ఉంటే మధ్యాహ్నాన సమయంలో కాకుండా ఉదయం లేదా సాయంత్రం సమయంలో పనులు చక్కబెట్టుకునేలా సమయం కేటాయించుకోవాలన్నారు. మంచినీళ్లు ఎక్కువగా త్రాగాలని సూచించారు. వైద్య సిబ్బంది ఓఆర్ఎస్ ద్రావణం ప్యాకెట్లు అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. ఓఆర్ఎస్ ద్రావణం ఉపయోగాలను వివరించారు. అనంతరం ఓఆర్ఎస్ ద్రావణం ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, పిహెచ్ఎన్ పి ఎలిజిబెత్, సూపర్‌వైజర్ ఎస్‌కే ఆమలేశ్వరరావు, ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పి, అంగన్వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేస్తున్న దృశ్యం

త్రుటిలో తప్పిన ప్రమాదం

ఆకివీడు: అప్రమత్తతతో త్రుటిలో ప్రమాదం తప్పింది. పల్సర్ బైక్ నుంచి పొగలు రావడంతో స్థానికులు గుర్తించి కేకలు వేయడంతో వెంటనే మోటారు సైకిల్‌పై ఉన్న ఇద్దరు వ్యక్తులు కిందికి దిగి పరిస్థితిని పరిశీలించారు. స్థానిక సంత మార్కెట్‌లో సోమవారం సాయంత్రం జరిగిన ఈ సంఘటన స్థానికుల్ని భయభ్రాంతులకు గురి చేసింది. మండుటెండల్లో పెట్టిన మోటారు సైకిల్‌లోని వైర్లు షార్టు సర్క్యూట్ అవ్వడంతో మంటలు వచ్చి పొగలు చిమ్మింది. వెంటనే వాటిని ఆర్పివేసి సీటు తొలగించి పరిశీలించడంతో షార్టు సర్క్యూట్‌గా గుర్తించారు.



మోటారు సైకిల్ నుంచి వస్తున్న పొగలను ఆర్పివేసిన దృశ్యం

హ్యాండీక్రాఫ్ట్ ఎక్స్ పోను సద్వినియోగం చేసుకోవాలి

భీమవరం(ప్రకాశం చౌక్): న్యూఢిల్లీ ఎక్స్పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ ఫర్ హ్యాండీక్రాఫ్ట్స్ ఆధ్వర్యంలో మార్చి 21 నుంచి 25 వరకు నరసాపురంలో నిర్వహించనున్న హ్యాండీక్రాఫ్ట్స్ ఎక్స్ పో ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సి.నాగరాణి కోరారు. సోమవారం కలెక్టరేట్ చాంబర్‌లో కలెక్టర్ సంబంధిత యాజమాన్యంతో కలిసి ఎక్స్‌పో గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ ఎక్స్‌పోలో ప్రసిద్ధిగాంచిన హ్యాండీక్రాఫ్ట్స్, ఫ్యాషన్ జ్యుయలరీ, గృహోపకరణాలు, హోమ్ ఫర్నీషింగ్, లేసు ఉత్పత్తులు, కలంకారీ శారీస్, తదితర వస్తువుల ప్రదర్శన, అమ్మకం ఉంటుందన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు



పెనుమంత్రలో విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన టిప్పర్



ప్రమాదానికి గురైన బైక్

పెనుమంత్ర: స్థానిక మార్టేరు – పెంటపాడు స్టేట్‌హైవేపై సోమవారం మధ్యాహ్నం జరిగిన రెండు వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరికి స్వల్పగాయాలయ్యాయి. వీరవాసరం మండలం కొణితివాడకు చెందిన నాగరాజు సత్యనారాయణ అనే యువకుడు మోటారు సైకిల్‌పై గరువు గ్రామం నుంచి కొణితివాడకు తిరిగి వెళుతుండగా వెంకటేశ్వర ఆక్వా షాపు వద్దకు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న పెనుమంత్రకు చెందిన మరో యువకుడు మోటారు సైకిల్‌తో ఢీకొట్టాడు. స్వల్పగాయాలయిన ఇద్దర్నీ స్థానికులు ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అదే సమయంలో ఇసుక లోడుతో వస్తున్న టిప్పర్ పద్మశ్రీ ఆక్వాషాపు వద్ద పక్క వీధిలోకి బ్యాక్ చేస్తుండగా విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. స్తంభం విరిగిపోయి విద్యుత్ తీగలకు వేలాడింది. దీంతో ఆక్వాఫీడ్ యజమాని, ఉపసర్పంచ్ భూపతిరాజు శ్రీనివాసరాజు, విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. వెంటనే విద్యుత్ సరఫరా నిలిపేశారు.

భీమేశ్వర స్వామికి వసంతోత్సవం



కలవపూడిలో భీమేశ్వరస్వామి ఆలయ విగ్రహాలను పల్లకిలో ఊరేగిస్తున్న దృశ్యం

కాళ్ల: కలవపూడి గ్రామం సోమవారం శివనామ స్మరణతో మార్మోగింది. కాళ్ళ మండలం కలవపూడి గ్రామంలో వేంచేసియున్న శ్రీ ఉమా భీమేశ్వరస్వామికి భక్తులు సోమవారం వసంతోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామమంతా ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. స్వామి అమ్మవార్లను పల్లకిలో ఊరేగింపుగా తీసుకెళ్ళి పురవీధుల గుండా గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వేసవిలో పశువుల సంరక్షణకు సూచనలు



నరసాపురం రూరల్: వేసవిలో పశువులకు వడదెబ్బ తగిలే ప్రమాదముంటుంది. వడదెబ్బతో పాల దిగుబడి తగ్గి పశువులు ఎదకు వచ్చే పరిస్థితులు కనిపించవు. వడదెబ్బ తగిలిన పశువు చూడుకట్టే అవకాశం ఉండదని పశువైద్యాధికారి సురేంద్ర తెలిపారు. వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పశువుల్లో సోకే వ్యాధులపై ఆయన వివరించారు.

ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు

ముందస్తుగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. పశువుల పాక చుట్టూ పాత గోనెలు కట్టి వాటిని అప్పుడప్పుడు తడుపుతూ ఉండాలి. పైకప్పును కొబ్బరి ఆకులతో గానీ, ఎండి వరిగడ్డితో గాని కప్పాలి. మంచినీరు ఎల్లప్పుడు అందుబాటులో ఉండేలా చూడాలి. పశువులను ఉదయం, సాయంత్రం మాత్రమే అంటే చల్లని వాతావరణంలోనే మేత మేసేందుకు విప్పాలి. పశువులు ఎక్కువగా ఎండలో తిరగకుండా చూడాలి. వీలైనంత పచ్చి మేత ఇవ్వాలి. సంకర జాతి, హెచ్ఎఫ్, జెర్సీ లాంటి ఆవులైతే పశువు కొట్టంలో పంకాలు ఏర్పాటు చేయాలి.

వడదెబ్బ లక్షణాలు

వడదెబ్బ తగిలిన పశువుల లక్షణాలను పరిశీలిస్తే శరీర ఉష్ణోగ్రత 101 నుంచి 108 డిగ్రీల వరకు పెరుగుతుంది. పశువుల నడిచేటప్పుడు తూలుతాయి. శ్వాసక్రియ ఎక్కువగా ఉంటుంది. పశువు చాలా నీరసంగా ఉంటుంది. ఒక్కోసారి కింద పడి కొట్టుకుని స్పృహ కోల్పోతాయి. పశువు నీటి కోసం చూస్తుంటుంది. పశువు చర్మం ఎండిపోయినట్లు ఉంటుంది. పశువుల్లో పాల ఉత్పత్తి తగ్గుతుంది. ఇలాంటి లక్షణాలు ఉంటే వడదెబ్బ తగిలిందని రైతు గ్రహించాలి.

వడదెబ్బకు తగిన చికిత్స అవసరం



వడదెబ్బ తగిలిన పశువును రైతులు గుర్తించిన వెంటనే చల్లని నీటితో ముఖాన్ని కడగాలి. గుడ్డతో ఐస్ చుట్టి పశువు నుదుటిపై నొత్తాలి. కొద్ది ఊరట కలిగిన తరువాత దగ్గరలోని పశు వైద్యుడిని సంప్రదించి సెలైన్‌లు పెట్టాలి. ఒక్కసారి వడదెబ్బ తగిలిన పశువుకు బ్రతికినంత కాలం పాలదిగుబడి గతంలో మాదిరిగా ఉండదు.

డాక్టర్ సురేంద్ర, పశువైద్యాధికారి

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 7 ఫిర్యాదులు

ఆకివీడు: ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఏడు ఫిర్యాదులు అందినట్లు ఎంపీడీఓ సుహాసిని సోమవారం చెప్పారు. భర్త చనిపోవడంతో వృద్ధాప్య ఫించన్‌ను తనకు మంజూరు చేయాలని, బందులదొడ్డిని బాగుచేయించి రోడ్లపై తిరుగుతున్న పశువుల్ని అక్కడ ఉంచాలని, సాలిపేటలో ఆక్రమణల తొలగింపుపై చర్యలు తీసుకోవాలని, పెదపేటలో శిథిలావస్థలో ఉన్న రామాలయం బాగుచేయించి, భక్తులు దేవాలయానికి వచ్చేలా సౌకర్యం కల్పించాలని తదితర ఫిర్యాదు చేశారు.

కాళ్లలో నాలుగు ఫిర్యాదులు

కాళ్ల: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో నాలుగు ఫిర్యాదులు అందినట్లు కాళ్ళ తహసీల్దార్ జి.సుందర్ సింగ్ తెలిపారు. కాళ్ళ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమంలో కాళ్ల గ్రామంలో ఆక్రమణలు తొలగించాలంటూ రెండు ఫిర్యాదులు, కలవపూడి గ్రామంలో తండ్రికి సంబంధించిన ఆస్తి తమకే రావాలంటూ కుమారుడు ఫిర్యాదు చేశారని, బొండాడలో ఆక్రమణలు తొలగించాలని మరో ఫిర్యాదు వచ్చినట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జి.స్వాతి, ఈఓపీఆర్డీ భాస్కరరావు, ఆర్ఐ లక్ష్మీకిరణ్, ఏఈలు రాంబాబు, ఫణి శంకర్, లీలాప్రసన్న, ఫణి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా టెన్నిస్ పోటీలు

భీమవరం: భీమవరం కాస్మోపాలిటన్ క్లబ్‌లో జరుగుతున్న ఆలిండియా సీనియర్ ర్యాంకింగ్ టెన్నిస్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. సోమవారం 35 ప్లస్ సింగిల్స్ విభాగంలో గణేష్ హోసన్నా, అశోక్ రెడ్డి, నగేష్ రెడ్డి, నితీష్ జాక్సన్, అశ్విన్ కుమార్ విజయం సాధించారు. 45 ప్లస్ సింగిల్స్‌లో కె.సంపత్‌కుమార్, జి.వెంకటేశ్వర్లు, ఎం.ఎస్.శివకుమార్ రాజు, ఎంఎస్ కిరణ్, సుబ్రహ్మణ్యం గోపాల కృష్ణన్ గెలుపొందారు. 55 ప్లస్ సింగిల్స్ విభాగంలో ఆదిశేషయ్య, ఎస్ఎస్ రాత్, కోటేశ్వరరావు, బాబు రాజన్, మణికందన్, రామకృష్ణ రెడ్డి విజయం సాధించారు. 65 ప్లస్ సింగిల్స్ విభాగంలో శ్రీనివాసరెడ్డి, రంజిత్ లంకా, పాలచంద్ర, వి.ధనుంజయ గెలుపొందారు. 70 ప్లస్ సింగిల్స్ విభాగంలో సేతు, బీఎల్ఎన్ రాజు, బి.జి.రెడ్డి విజయం సాధించారు.

ప్రజలతో మమేకం కావాలి

తాడేపల్లిగూడెం రూరల్: ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి కృషి చేయాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి ముప్పిడి సంపత్‌కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని కృష్ణాయపాలెం గ్రామంలో పార్టీ శ్రేణులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంపత్‌కుమార్ మాట్లాడుతూ పార్టీ అప్పగించిన బాధ్యతలను తప్పకుండా పాటించాలన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో చేపట్టిన కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ పార్టీని పటిష్టం చేయాలన్నారు. పార్టీ ఆదేశానుసారం గ్రామ గ్రామాన కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం కృష్ణాయపాలెం గ్రామ కమిటీని నియమించారు.

సమస్యలు పరిష్కరించాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): బ్యాంకు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఏబీఈఈఏ నేషనల్ కౌన్సిల్ సభ్యులు టీవీ సూర్యనారాయణ కోరారు. ఎస్‌బీఐ మార్కెట్ యార్డ్ శాఖ సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్యాంకు యూనియన్ల డిమాండ్లను పరిష్కరించాలని, 5 పనిదినాలు అమలు చేయాలని, బ్యాంకుల్లో రిక్రూట్‌మెంట్ చేపట్టాలని, లేడీస్ స్టాఫ్‌కు రక్షణ కల్పించాలని తదితర డిమాండ్లతో చేస్తున్న సమ్మెను ఐబీఏ, ప్రభుత్వాలు ఆయా సమస్యల పరిష్కారం ద్వారా నివారించాలని కోరారు.